నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 6 జూలై 2024 | HYDERABAD




తెలంగాణ భవన్‌లో శుక్రవారం గ్రేటర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల తో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటి గోపీనాథ్, ప్రకాశ్‌గౌడ్, పద్మారావుగౌడ్, ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సురభివాణీదేవి పాల్గొన్నారు.

## 3 కేసులు.. 370 మంది అరెస్టు



సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్, జూలై 5 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ ముట్టడిపై బేగంబజార్ పోలీసులు మూడు కేసులు నమోదు చేసి, 370 మందిని ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ ముట్టడికి నిరుద్యోగులు పిలుపునివ్వడం దానిని అడ్డుకోవడం కోసం పోలీసులు విఫలయత్నం చేసి, పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు టీజీపీఎస్సీకి సమీపంలో ఉన్న గాంధీభవన్‌లో గద్వాల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దంటూ ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే శుక్రవారం మొహింజాహి మార్కెట్ నుంచి నాంపల్లి వరకు సాధారణ ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభించిపోవడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.







టీజీపీఎస్సీ ముట్టడికి వచ్చిన నిరుద్యోగులను అడ్డుకొని..పట్టుకెళ్తున్న పోలీసులు

నిరుద్యోగులపై నగర పోలీసులు విరుచుకుపడ్డారు. తమ ప్రతాపాన్ని చూపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరుద్యోగులు శుక్రవారం టీజీపీఎస్సీ (తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు టీజీపీఎస్సీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా..నగరం నలుమూలల నుంచి నాంపల్లి వైపు వెళ్లకుండా నిరుద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు.. నిరుద్యోగులతో పాటు రైతులు, జర్నలిస్టులు, సామాన్యులను సైతం వదలేదు. ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, చిక్కడపల్లి, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్ ఇలా అన్ని ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిఘా పెట్టి నిరుద్యోగ యువత బయటకు వెళ్లకుండా ఉండేలా కట్టడి చేశారు. ఇలా నిర్బంధకాండ కొనసాగుతున్నా.. ఛేదించుకొని.. నిరుద్యోగులు టీజీపీఎస్సీకి చేరుకోవడంతో పోలీసులు ఆగ్రహంతో ఊగిపోయారు. దొరికినవారిని దొరికినట్లు ఈడ్చుకెళ్లి.. అరెస్టు చేశారు. పోలీసుల అనుసరించిన వైఖరిపై నిరుద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. - సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ)

# నిరుద్యోగులపై దమనకాండ

## టీజీపీఎస్సీ ముట్టడి.. ముళ్ల కంచెలతో కట్టడి

- నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడికి బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు సికింద్రాబాద్ నుంచి తరలివెళ్లి.. ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే పోలీసులు వారిపై దాడి చేసి గాయపరిచారని, అనంతరం అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు యాదా క్రాంతి తెలిపారు.



టీజీపీఎస్సీ వద్ద ముళ్ల కంచె ఏర్పాటు చేసిన పోలీసులు



గోషామహల్ స్టేడియంలో..



ఓ నిరుద్యోగిని ఈడ్చుకెళ్తూ..

- నిరుద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నాంపల్లికి వచ్చే మార్గాలన్నింటినీ కట్టడి చేశారు. అయితే కారిడార్-1లోని మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో నడిచే మెట్రో రైళ్లలో ప్రయాణించేందుకు వచ్చిన యువత, మహిళలను అడ్డుకున్నారు. దీంతో తాము ముట్టడి కార్యక్రమానికి వెళ్లడం లేదని, తమ ఆఫీసులకు వెళ్తున్నామని చెప్పినా.. పోలీసులు వినిపించుకోకుండా అడ్డుకొని మెట్రో రైలులో ప్రయాణం చేయనివ్వలేదు.
- రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గుండుమల్ల పాండుగౌడ్‌తో పాటు విద్యార్థి నాయకులను చైతన్యపురి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.
- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడిని అడ్డుకునేందుకు తెల్లవారుజామున బీఆర్‌ఎస్ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింగ్‌రావును ముందస్తుగా అరెస్టు చేసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు నర్ర ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నవీన్, వినోద్, శ్రీకాంత్, సాయి తదితరులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నర్సింగ్‌రావును పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో నిరుద్యోగులు తమ నిరసనలను తెలియజేస్తుంటే ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తున్నదన్నారు.



టీజీపీఎస్సీ వద్ద ఆప్ నేతల నిరసన

- అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు తాళ్ల కార్తిక్, దీక్షిత్‌రెడ్డి అన్నారు. కందుకూరు మండల పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ నాయకులను ముందస్తుగా స్థానిక పోలీసులు అరెస్టు చేశారు.
- నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఉదయం 5 గంటలకు ఘట్‌కేసర్‌లో బీజేవైఎం అధ్యక్షుడు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనిల్‌గౌడ్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు.
- విద్యార్థి,యువజన సంఘాల నేతల ఇండ్లలోకి చొరబడి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు.

### అరెస్టు చేయడం సరికాదు



ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగినందుకు నిరుద్యోగులను అరెస్టు చేయడం సరికాదు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, గ్రూప్ పోస్టులు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ అమలు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నా..ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

-బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు మిద్దె సురేశ్

### పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు



నిరుద్యోగులు తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అరెస్టులు చేయడం సరికాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చింది. హామీని వెంటనే అమలు చేయాలి.

-నిరుద్యోగి శ్రీనివాస్

- నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రూప్స్ పోస్టులు పెంచాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని తదితర డిమాండ్ల అమలు కోసం నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడి చేపట్టారు. ఈ నేపథ్యంలో సిటీ సెంట్రల్ లైబ్రరీ గేటు ముందు ఉదయం నుంచే చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య పర్యవేక్షణలో పోలీసులు మోహరించారు. ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించిన నలుగురు నిరుద్యోగులను అదుపులో తీసుకున్నారు.



విద్యార్థి నేతను పట్టుకెళ్తూ..



మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుడిని ఆపుతూ..

# టీవోడీకి గుడ్‌బై!

- ‘రియల్’ కార్యకలాపాలను పట్టించుకోని ఎల్ అండ్ టీ మెట్రో
- ఒక్కొక్కటిగా థర్డ్ పార్టీకి అప్పగింత
- భూములన్నీ లీజుకిచ్చేందుకు ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు



సిటీబ్యూరో: రవాణా ఆధారిత అభివృద్ధి అన్న నినాదానికి ఎల్ అండ్ టీ మెట్రో స్వస్తి పలుకుతోంది. సమగ్ర రవాణా వ్యవస్థతో అత్యంత మెరుగైన అభివృద్ధి సాధించవచ్చన్న లక్ష్యంతో చేపట్టిన రవాణా ఆధారిత అభివృద్ధికి తూట్లు పొడుస్తూ ..ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ క్రమంగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను చేపట్టకుండా ఇతర సంస్థలకు అప్పగిస్తుండటంతో టీవోడీ లక్ష్యం దెబ్బతింటోంది. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలైన మెట్రోమాల్స్‌ను దీర్ఘ కాలిక లీజుకు ఇచ్చేందుకు ఎల్ అండ్ టీ సంస్థ ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు చేస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టు భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో సంస్థకు ప్రభుత్వం రాయదుర్గంలోని మైండ్ స్పేస్ జంక్షన్ సమీపంలో 15 ఎకరాలను కేటాయించింది. అందులో రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్-టీవోడీ)లో భాగంగా బిజినెస్ పార్కు టవర్ 1ను నిర్మించారు. మిగతా ఖాళీ స్థలాన్ని మొత్తంగా ఇతర సంస్థలకు గతేడాది దీర్ఘకాలిక లీజుకు ఇచ్చారు. దీని ద్వారా సుమారు రూ. 1200 కోట్ల ఒకేసారి సమకూర్చుకున్నట్లు సమాచారం. అదేవిధంగా కారిడార్-1లో పంజాగుట్ట, ఎర్రమంజిల్, మూసారంబాగ్ ప్రాంతాల్లో 3 మెట్రో మాల్స్‌ను నిర్మించగా, కారిడార్-3లో హైటెక్ సిటీ వద్ద మాల్‌ను నిర్మించారు. మొత్తం 4 మాల్స్ ఉండగా, వాటి విస్తీర్ణం 12 లక్షల చదరపు అడుగుల వరకు ఉంది. ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ హైదరాబాద్ నెక్ట్స్ గలేరియా పేరుతో మాల్స్‌ను నిర్వహిస్తోంది. వీటన్నింటినీ థర్డ్ పార్టీలకు అప్పగించాలని నిర్ణయం తీసుకొన్నది. ఇతరులకు భూములను అప్పగించడం ద్వారా అక్కడ ప్రజా ప్రయోజనాల కన్నా, తమ లాభాలను పరిగణలోకి తీసుకొని ప్రైవేటు సంస్థలు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహించే అవకాశమున్నది. మెట్రో స్టేషన్లతో రైల్వే, ఎంఎంటీఎస్, బస్‌స్టేషన్ల వంటి ప్రధాన రవాణా మార్గాల్లో నివాస, వాణిజ్య, వినోద కార్యక్రమాల నిర్వహణ వంటి బహుళ ప్రయోజనాలకు ఉద్దేశించిన టీవోడీ ప్రాజెక్టులు ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన నేపథ్యంలో నగరంలోనూ ఈ తరహా ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆ దిశగా ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ మాత్రం అభివృద్ధి చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

### టీవోడీ అంటే ?

రవాణా వ్యవస్థ ఉన్న చోట అన్ని రకాల అభివృద్ధికి నిలయమైన నిర్మాణాలను చేపట్టడం, దూరం ఎంతైనా క్షణాల్లో చేరుకునే ప్రయాణ సదుపాయం కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్లకు అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రాంతంలో సకల వసతులతో టీవోడీ కింద ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంలో నివాస, వినోద, వాణిజ్య నిర్మాణాలను చేపడుతారు. అపార్ట్‌మెంట్లు, మాల్స్‌తో పాటు ఐటీ అనుబంధ సంస్థలు ఇక్కడ ఏర్పాటవుతాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారులు, ఇతర రవాణా వసతులుంటాయి. సైక్లింగ్ జోన్లు ఉంటాయి. కాలుష్యరహితంగా వీటిని తీర్చిదిద్దుతారు. నిరంతర రాకపోకలు సాగించే వారికి ఈ ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయి. కాగా, అలాంటి నిర్మాణాలు, ఏర్పాట్లు మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు కావడం లేదు. ప్రజా రవాణా వ్యవస్థల మధ్య సరైన అనుసంధానం సరిగా లేదని నగర ప్రయాణికులు పేర్కొంటున్నారు.


